క్లుప్తంగా

ఘనంగా పెంటమాంబ ఆలయ వార్షికోత్సవం



అమ్మవారి ఘటాల ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే నాగిరెడ్డి, కార్పొరేటర్ వంశీరెడ్డి

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డు దయాల్‌నగర్ లోవలోని పెంటమాంబ అమ్మవారి ఆలయ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారి ఘటాలను ఊరేగించారు. ఆలయ వార్షికోత్సవాన్ని 30 సంవత్సరాలుగా ఘనంగా నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులకు, గ్రామస్తులకు అమ్మవారి దివ్య ఆశీస్సులు ఉండాలని ఎమ్మెల్యే నాగిరెడ్డి ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాజన్ నాయుడు, బొడ్డ గోవింద్, లోకేష్, చినబాబు, సత్యం పాల్గొన్నారు.

ఆస్పత్రిలో పాత సామగ్రి వేలానికి టెండర్ల ఆహ్వానం

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడిలోని ఏరియా ఆస్పత్రిలో పాత సామగ్రిని వేలం వేయనున్నట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉష తెలిపారు. ఈ నెల 19వ తేదీ నుంచి 24వ తేదీ వరకు కార్యాలయంలో ఉదయం పదిన్నర నుంచి సాయంత్రం ఐదు గంటలలోపు వేలం బిడ్ దరఖాస్తులు అందుబాటులో ఉంటాయన్నారు. బిడ్ దరఖాస్తుకు రూ. 5వందలు (తిరిగి చెల్లించబడదు) చెల్లించి దరఖాస్తును పొందాలని ఆమె కోరారు. దరఖాస్తుతో పాటు ఆస్పత్రి అభివృద్ధి కమిటీ పేరుతో రూ.5వేల డిమాండ్ డ్రాఫ్టును సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. 25వ తేదీన బిడ్లు తెరిచి తక్కువ ధరకు కోట్ చేసిన టెండర్లను ఖరారు చేస్తామని తెలియజేశారు.

స్టీల్‌ప్లాంట్ క్వార్టర్స్‌లో పాము కలకలం



పట్టుకున్న పాముతో కిరణ్‌కుమార్

ఉక్కునగరం: స్టీల్ ప్లాంట్ సెక్టార్-3లోని క్వార్టర్‌లో పాము నివాసులను భయాందోళనకు గురి చేసింది. సెక్టార్-3లోని 108 డీ క్వార్టర్‌లో నివసిస్తున్న స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి కుటుంబీకులు గదిలో నక్కి ఉన్న పామును చూసి బయటకు పరుగులు తీశారు. చుట్టుపక్కల వారు కూడా ఆందోళన చెందారు. ఈ విషయాన్ని స్నేక్ క్యాచర్ రొక్కం కిరణ్‌కుమార్‌కు సమాచారం అందించడంతో, ఆయన వచ్చి ఆ పామును ఒడిసి పట్టుకున్నారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. పామును ఫారెస్ట్ అధికారులకు అప్పగిస్తానని కిరణ్‌కుమార్ తెలిపారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



స్వర్ణపుష్పార్చనలో పాల్గొన్న ఉభయదాతలు

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

20న సహస్ర తులసిపూజ


కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 20న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని ఈవో పేర్కొన్నారు.

కమ్మేస్తున్న కాలుష్యం

- దుమ్ము, ధూళితో నిండిపోతున్న పోర్టు రోడ్డు
- నివాసితులకు ఆరోగ్య సమస్యలు



రోడ్డు మధ్యలో మెటీరియల్



పోర్టు రోడ్డులో రేగుతున్న ధూళి



హైవే పక్కన ఇలా..

గాజువాక: ఒకవైపు కమ్మేస్తున్న దుమ్ము, ధూళి.. మరోవైపు నిబంధనలను పాటించని భారీ వాహనాలతో ముంచుకొస్తున్న ముప్పు.. స్థానిక వందడుగుల రోడ్డు నుంచి జగ్గు జంక్షన్ మీదుగా పోర్టు రోడ్డులోని వై జంక్షన్ వరకు చోటు చేసుకున్న పరిస్థితి ఇది. పారిశ్రామిక మెటీరియల్స్‌తో ఈ రోడ్డులో రాకపోకలు సాగిస్తున్న లారీలు, టిప్పర్ల వంటి భారీ వాహనాల వల్ల కాలుష్యం కమ్మేస్తోందని సుమారు పది కాలనీల వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు రెండు కిలోమీటర్ల మేర ప్రయాణానికి ఊపిరాడటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గంగవరం పోర్టు, విశాఖ స్టీల్‌ప్లాంట్ల నుంచి ప్రతీ రోజు వందలాది లారీలు, టిప్పర్లు స్వతంత్రనగర్, దుర్గానగర్, వై.జంక్షన్, పాత కర్ణవానిపాలెం, అఫీషియల్ కాలనీ, జగ్గు జంక్షన్, వందడుగుల రోడ్డు మీదుగా జాతీయ రహదారికి చేరుకుంటాయి. బొగ్గు, జిప్సం, ఇనుప ఖనిజం, గంధకం పొడి వంటి రసాయన పదార్థాలను రవాణా చేస్తుంటాయి. పోర్టు రోడ్డు మొదలుకొని ఇటు జాతీయ రహదారిపై కూడా లారీల్లోని మెటీరియల్ రోడ్ల మీదే పడిపోతోంది. లారీలు, టిప్పర్లతో పెద్ద మొత్తంలో సరకు వెళ్తున్నా కనీస ప్రమాణాలు పాటించడం లేదు. రోడ్లపైనే మెటీరియల్ పడిపోవడం, వాటి వెనుక వెళ్తున్న వాహనాలు ఆ మెటీరియల్‌పై నుంచి వెళ్తుండటంతో దుమ్ముగా మారి వాహన చోదకుల కళ్లలోకి పడిపోతోంది. కాలుష్యం పొగ మాదిరిగా కమ్మేస్తోంది. అధికలోడు, టార్పాలిన్ సరిగా కట్టకపోవడం, తొందరగా ట్రిప్పులు వేయాలన్న ఆదుర్దా.. ఆ రోడ్డులోని కాలనీల నివాసులకు కూడా శాపంగా మారుతోంది.

కమ్మేస్తున్న దుమ్ము, ధూళి

వై.జంక్షన్, జగ్గు జంక్షన్ మీదుగా జాతీయ రహదారి వైపు రాకపోకలు సాగిస్తున్న లారీల కారణంగా కాలుష్యం అధికమవుతోంది. దుమ్ము, ధూళి ఎగిరిపడి ఇళ్లల్లోకి చేరుతోందని ఈ రోడ్డును ఆనుకొని ఉన్న నివాసులు గగ్గోలు పెడుతున్నారు. తలుపులు మూసుకున్నా ఇళ్లల్లోకి దుమ్ము ఆగడం లేదని చెబుతున్నారు. కాగా, లారీల వెనుక వెళ్లే ద్విచక్ర వాహనదారులకు ప్రమాదాలకు గురవుతున్నారు. తరచూ ప్రమాదాలు చోటు చేసుకొంటుండటంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తరచూ ఆరోగ్య సమస్యలు

ఈ కాలుష్యం కారణంగా అనారోగ్యాలకు గురవుతున్నామని నివాసులు పేర్కొంటున్నారు. కళ్ల మంటలు, జలుబు, దగ్గు, గొంతునొప్పి, తలనొప్పి, శ్వాసకోశ వ్యాధులు, క్షయ, ఉబ్బసం, ఎలర్జీ, చర్మ వ్యాధులు చోటు చేసుకొంటున్నాయని చెబుతున్నారు ముఖ్యంగా గర్భిణులు, పిల్లలు ఈ కాలుష్యం బారిన పడి దుష్పరిణామాలకు లోనవుతున్నారని పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పోర్టు యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లాం

పోర్టు రోడ్డు నుంచి వందడుగుల రోడ్డు వరకు కాలుష్యాన్ని తగ్గించడానికి అన్ని విధాలా చర్యలు చేపడుతున్నాం. నిబంధనలను పాటించని లారీలపై భారీ మొత్తంలో అపరాధ రుసుం విధిస్తూనే ఉన్నాం. అయినా ఆశించిన మార్పు రావడం లేదు. గంగవరం పోర్టుపై ఒత్తిడి తెచ్చి కాలుష్య నివారణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నాం. రోడ్లను నిరంతరం శుభ్రం చేయడానికి 30 మంది కార్మికులను ఇవ్వాలని అడిగితే పది మందిని మాత్రమే ఇచ్చారు. ఎన్‌జీటీ మార్గదర్శకాలను అమలు చేయాలని పోర్టు యాజమాన్యానికి చెప్పాం. కాలుష్య నియంత్రణ మండలి, జిల్లా కలెక్టర్‌తో కూడా మాట్లాడి తగిన పరిష్కార చర్యలను సూచించాం. అవన్నీ ప్రతిపాదన దశలో ఉన్నాయి. వీలైనంత తొందర్లోనే ఈ సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతాం.

– పి.సింహాచలం, గాజువాక జోనల్ కమిషనర్

ప్రతీ ఇంటికి ఆత్మ బంధువై..

- సేవలందిస్తున్న వలంటీర్లు
- లబ్ధిదారుల ప్రశంసలు



గాజువాక: ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారుల చెంతకు చేరుస్తున్న వలంటీర్ల సేవలపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆత్మీయంగా పలకరిస్తూ, కష్టంలో ఆదుకుంటున్నారంటూ కొనియాడుతున్నారు. ఎంతో నిజాయితీగా సేవలను అందిస్తున్న వలంటీర్లపై ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు.

ఒకటో తేదీ తెల్లవారేసరికి పింఛన్



మా వలంటీర్ శ్రావణి ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారేసరికే మా ఇంటికి వచ్చి పింఛన్‌ను ఇస్తుంది. కొన్నిసార్లు నేను నిద్ర లేవడానికంటే ముందుగానే వచ్చి డబ్బులు తీసుకోండని పిలుస్తుంది. ఇంతకుముందు ఏనాడూ పింఛన్ ఇలా రాలేదు. ఇప్పుడు మాత్రం జగన్‌బాబు దయ వల్ల క్రమం తప్పకుండా ఇంటికే వచ్చి పింఛన్ ఇస్తున్నారు.

– సిమ్మ పైడితల్లి, గాజువాక

సొంత కూతురిలా సాయం చేస్తోంది



నాకు ఏ ఆసరా లేదు. ఒంటరిగానే బతుకుతున్నాను. ముందు, వెనుక ఎవరూ లేకపోవడంతో గాజువాకలోని ఒక వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్నాను. నాకు సొంత కూతురిలా వలంటీర్ పతివాడ దేవి సహాయం చేస్తోంది. ప్రతి నెలా 70వ వార్డు నుంచి 67వ వార్డులో ఉన్న మా వృద్ధాశ్రమానికి వచ్చి పింఛన్ ఇస్తోంది. నా ఆరోగ్యంపై కూడా వివరాలు అడుగుతుంటుంది.

– దన్నిన వరహాలమ్మ, గాజువాక

ఆస్పత్రికి వచ్చి పెన్షన్ ఇచ్చింది



నా కాలుకు దెబ్బ తగిలి అనకాపల్లిలోని ఎన్‌టీఆర్ ప్రభుత్వాస్పత్రిలో ఆపరేషన్ చేయించుకున్నాను. ఈ విషయం తెలుసుకున్న మా వలంటీర్ నాగేశ్వరి గాజువాక నుంచి అనకాపల్లి వచ్చి పింఛన్ ఇచ్చింది. నా ఆపరేషన్‌కు ప్రభుత్వం నుంచి అందాల్సిన సహకారాన్ని ఆమె చొరవ వల్ల పొందాను.

– గండిబోయిన పైడితల్లి, డ్రైవర్స్ కాలనీ.

పకడ్బందీగా ఓటు నమోదు ప్రక్రియ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- బూత్ కమిటీ నియామకాలపై సూచనలు

పెదగంట్యాడ: గాజువాక నియోజకవర్గంలో 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు నమోదు చేసేలా సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు కృషి చేయాలని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కోరారు. స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో ముఖ్య నాయకులతో మంగళవారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని వార్డుల్లో పార్టీ కోసం ఉత్సాహంగా పని చేస్తున్న వారిని బూత్ కమిటీలో నియమించాలని సూచించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విరివిగా తీసుకెళ్లాల్సిన బాధ్యత సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులపై ఉందన్నారు. కార్పొరేటర్లు, పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర కమిటీ, జిల్లా కమిటీ, వివిధ అనుబంధ సంస్థల ప్రతినిధులు, డైరెక్టర్లు, చైర్మన్లు నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. వచ్చే ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభంజనం సృష్టించాలన్నారు. ప్రతిపక్ష తెలుగుదేశం, జనసేన పార్టీలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేస్తున్న తప్పుడు ప్రచారాలను తిప్పి కొట్టాలని సూచించారు. సమావేశంలో డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, భూపతిరాజు సుజాత, నాయకులు మార్టుపూడి పరదేశి, రాజాన వెంకటరావు, ధర్మాల శ్రీను, వెంపాడ అప్పారావు, దొడ్డి రమణ, కోమటి శ్రీనివాసరావు, మంత్రి శంకరనారాయణ, ఎన్నేటి రమణ, గొందేశి శ్రీనివాస్ రెడ్డి, మద్దాల అప్పారావు, నాగిశెట్టి శ్రీను, సంపంగి ఈశ్వరరావు, పూర్ణానంద శర్మ, కటికల కల్పన, బొడ్డ గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు' సంకల్పానికి కేంద్రం తలవంచాల్సిందే



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ప్రజలు, కార్మికుల 'ఉక్కు' సంకల్పానికి కేంద్రప్రభుత్వం తలవంచక తప్పదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఎన్ని ఎత్తుగడలు వేసినా పోరాటాల పురిటి గడ్డ అయిన విశాఖ ఉక్కు కర్మాగారం విషయంలో కేంద్ర ప్రభుత్వం దిగి రావాల్సిందేనన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష శిబిరంలో 887వ రోజు, మంగళవారం సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధ్వంసకర ప్రయత్నాలకు అండగా ఉంటూ, వాటిని అమలు జరిపే అధికారులకు తగిన గుణపాఠం నేర్పుతామన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తహతహలాడుతోందని, విశాఖ ఉక్కు జోలికి వస్తే కాంట్రాక్ట్ కార్మికులు, నిర్వాసితులు, ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కొనడానికి ఎవరు ముందుకు వచ్చినా అడ్డుకుంటామన్నారు. పోరాటాలు, ప్రాణత్యాగాల ద్వారా సాధించుకున్న సంస్థను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేట్‌పరం కానివ్వబోమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

15 ప్రాంతాల్లో నిత్యావసర సరకుల కౌంటర్లు



రాయితీపై సరకులను అందిస్తున్న అధికారులు

గాజువాక: నిత్యావసర సరకుల ధరలను అదుపు చేయడం కోసం ప్రభుత్వం చేపట్టిన చర్యల్లో భాగంగా పౌరసరఫరాల శాఖ గాజువాకలో 15 కౌంటర్లను ప్రారంభించింది. వివిధ చోట్ల ఈ కౌంటర్లను గాజువాక సివిల్ సప్లైస్ అధికారి కృష్ణ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యావసర సరకులను అందరూ ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలన్నారు. ఈ కౌంటర్ల ద్వారా కేజీ కందిపప్పును రూ.135కు, కిలో బియ్యాన్ని రూ.46కు విక్రయిస్తారని తెలిపారు. కందిపప్పుపై రూ.10, బియ్యంపై రూ.6 డిస్కౌంట్ ఇచ్చి విక్రయిస్తున్నట్టు పేర్కొన్నారు.

నేడు అగనంపూడిలో 'జగనన్న సురక్ష'

అగనంపూడి: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని 85వ వార్డు పెదమడకలోని రాజీవ్‌గాంధీ మున్సిపల్ కల్యాణ మండపంలో బుధవారం ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్లు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, గాజువాక జేసీఎస్ కన్వీనర్ వాడపల్లి రామచంద్రరాజు తెలిపారు. కొండయ్యవలస, పెదమడక, పినమడక, బీసీ కాలనీ, దిబ్బపాలెం సచివాలయాల పరిధిలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, జెడ్పీ పాందూరు సింహాచలం పాల్గొని దరఖాస్తుదారులకు ధ్రువపత్రాలను అందజేస్తారని తెలిపారు.

24న 75వ వార్డులో..

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డులో ఈ నెల 24న జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు గొందేశి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పాల్గొని, దరఖాస్తుదారులకు ధ్రువపత్రాలు అందజేస్తారని చెప్పారు. వార్డు పరిధిలోని నెల్లిముక్కు జీవీఎంసీ కల్యాణ మండపంలోని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో ఆయన మంగళవారం సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ధ్రువీకరణ పత్రాల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా, సత్వరం అందజేస్తారని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎల్‌వో వెంకటేష్, మార్టుపూడి పరదేశి, గొందేశి మహేశ్వరరెడ్డి, కొయ్య భారతి, గంట్యాడ గురుమూర్తి, ములకలపల్లి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్ల పండగకు కార్పొరేటర్ విరాళం



సభ్యులకు రూ.20 వేల చెక్కు అందిస్తున్న నాయకులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలోని దుర్గమాంబ, కుంచమాంబ అమ్మవార్ల పండగకు కార్పొరేటర్ గుడివాడ అనూష, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్ దంపతులు 20వేలు విరాళం అందించారు. అమ్మవార్ల పండగను ఘనంగా నిర్వహించేందుకు ఈ మొత్తాన్ని వినియోగించాలని వారు కోరారు. విరాళం చెక్కును వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు వరదాడ వెంకటరమణ, సచివాలయ కన్వీనర్ నంబారు రాజు, సోషల్ మీడియా కన్వీనర్ తెరుకూటి మహేష్ పండగ కమిటీ ప్రతినిధులకు అందజేశారు.

జగనన్న వైపే యువత



సీఎం జగన్‌కు మద్దతుగా నినాదాలు చేస్తున్న యువజన విభాగం నాయకులు

గాజువాక: యువత అభ్యున్నతికి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల శివగణేష్ అన్నారు. గాజువాకలోని యువజన విభాగం నాయకుడు కాసిరెడ్డి గణేష్ ఏర్పాటు చేసిన కార్యాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రికి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను చూసి ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయన్నారు. అసత్యాలు, మోసపూరిత ప్రకటనలతో యువతను తమ వైపు తిప్పుకోవడానికి ప్రయత్నిస్తున్నాయని, అయితే, ఆ పార్టీల ప్రచారాన్ని యువత నమ్మడం లేదని అన్నారు. 2019 ఎన్నికల్లో గాజువాకలో ఒక రీల్ హీరోను తిప్పల నాగిరెడ్డి చిత్తుగా ఓడించారని, ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన ఇక్కడి సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించారని పేర్కొన్నారు. గాజువాకలో యువ నాయకుడు గణేష్ సారథ్యంలో యువజన విభాగం మరింత సమర్థవంతంగా ఎదుగుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి జీలకర్ర నాగేంద్ర, జాన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ విద్యార్థికి పథకాలు అందాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో-1 విశ్వనాథం

గాజువాక: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న విద్యా పథకాలను ప్రతి విద్యార్థికి అందే విధంగా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని గాజువాక ఎంఈవో-1 విశ్వనాథం కోరారు. మండలంలోని ఉపాధ్యాయులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జగనన్న విద్యా దీవెన, జగనన్న విద్యా కానుక పథకాలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. వాటిని అంతే ప్రతిష్టాత్మకంగా ప్రతి విద్యార్థికి అందించాలన్నారు. మధ్యాహ్నం భోజనంలో ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 సునీత తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవోలకు సత్కారం



ఎంఈవోలను సత్కరిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

పెదగంట్యాడ: మండల విద్యా శాఖాధికారులుగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఇమందు శ్రీనివాస్, కె.రమణాజీలను పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ అధ్యక్ష కార్యదర్శులు ఎం.కృపాకర్, ఎస్‌వీ ప్రభాకర్, గౌరవాధ్యక్షుడు రామారావు, ఉపాధ్యక్షులు కుమార్, శ్రీనివాస్, రామారావు, సుశీల, రమాదేవి, వెంకట రామారావు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: వర్షా కాలంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున ఆరోగ్య శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు సూచించారు. మంగళవారం రేసపువానిపాలెంలోని డీఎంహెచ్‌వో కార్యాలయం సమావేశ మందిరంలో మలేరియా, డెంగ్యూ, ఫీవర్ సర్వే, సీజనల్ వ్యాధులపై జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కాలంలో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. శుభ్రమైన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. నోడల్ అధికారి డాక్టర్ రమారెడ్డి, జిల్లా మలేరియా అధికారి తులసీ, జిల్లా సర్వేలైన్స్ అధికారి డాక్టర్ జగదీశ్వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అప్పన్న నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్య కల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేసి శాస్త్రోక్తంగా కల్యాణ మహోత్సవం జరిపించారు. నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

దువ్వాడ రైల్వేస్టేషన్‌లో మొరాయిస్తున్న లిఫ్ట్



నాలుగో నంబర్ ప్లాట్‌ఫాంపై పని చేయని లిఫ్ట్

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ నాలుగో నంబర్ ప్లాట్‌ఫాంపై లిఫ్ట్ రెండు వారాల నుంచి మొరాయించడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. రూ.25 లక్షల వ్యయంతో 20మంది ప్రయాణికుల సామర్థ్యంతో ఏర్పాటు చేసిన లిఫ్ట్‌ను రెండు మాసాల క్రితం ప్రారంభించారు. అయితే, ఈ లిఫ్ట్ పని చేసిన రోజుల కంటే పనిచేయని రోజులే ఎక్కువని ప్రయాణికులు నిట్టూరుస్తున్నారు. పలుమార్లు ప్రయాణికులు లిఫ్ట్‌లో ఇరుక్కుని ఆర్పీఎఫ్ సిబ్బంది సహాయంతో బయటపడ్డారు. లిఫ్ట్ తరచూ మరమ్మతులకు గురవుతుండడంతో లగేజీలు, వృద్ధులతో ప్రయాణికులు పాట్లు పడుతున్నారు. రెండు వారాల నుంచి లిఫ్ట్ పనిచేయకపోయినా సంబంధిత అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైల్వే అధికారులు స్పందించి తక్షణం లిఫ్ట్ అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

గంగవరం పోర్టు యాజమాన్యంపై చర్యలు చేపట్టాలి



ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకుడు, 72వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారాం డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్‌కు చెందిన కోకింగ్ కోల్ షిప్పులను అదానీ పోర్టు యాజమాన్యం అన్‌లోడ్ చేయకుండా వదిలేయడాన్ని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో గంగవరం పోర్టు వంతెన సమీపంలోని గాంధీ విగ్రహం వద్ద మంగళవారం ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజుల క్రితం రష్యా, ఆస్ట్రేలియా నుంచి వచ్చిన రెండు షిప్పుల్లో ఉన్న 2 లక్షల 20వేల టన్నుల కోకింగ్ కోల్‌ను అన్‌లోడ్ చేయకుండా నిలుపుదల చేసి స్టీల్ ప్లాంట్ ఉత్పత్తికి అదానీ యాజమాన్యం ఆటంకం కలిగించిందని ఆరోపించారు. 2026 సంవత్సరం వరకు ఒప్పందం ఉన్నా, దాన్ని ఉల్లంఘించిన అదానీ పోర్టు యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు చేపట్టాలని డిమాండ్‌చేశారు. వెంటనే షిప్పుల్లోని కోకింగ్ కోల్‌ను అన్‌లోడ్ చేయకపోతే తామే పోర్టులోకి వచ్చి అన్‌లోడ్ చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. సీపీఎం స్టీల్ జోన్ కార్యదర్శి శ్రీనివాసరాజు మాట్లాడుతూ గంగవరం పోర్టులో స్టీల్‌ప్లాంట్ బెర్త్ నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రామస్వామి, కొవిరి అప్పలరాజు, బైరెడ్డి గురప్ప, నమ్మి రమణ, కంబాల మహేష్, జి.శ్రీనివాస్, కణితి అప్పలరాజు, పాల అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.